# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 51 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మే | బుధవారం | 21-5-2025 | వెల : .రూ. 5.00




## పహల్గామ్ పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయారు

- ఆపరేషన్ సిందూర్ చిన్న యుద్ధం మాత్రమే
- కేంద్రాన్ని ఆడిపోసుకున్న మల్లికార్జున ఖర్గే
- ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేత

**న్యూఢిల్లీ,** మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకుల ప్రాణాలు రక్షించడంతో కేంద్రం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ చిన్న యుద్ధం అని అభివర్ణించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ముందే ప్రధాని నరేంద్రమోడీకి సమాచారం ఉందని ఆరోపించారు. -మిగతా 2 లో



## కాళేశ్వరం కమిషన్ దూకుడు

### కేసీఆర్ తదితరులకు నోటీసులు

- విచారణలో మరింత వేగం
- జూన్ 5న విచారణకు రావాల్సిన ఆదేశం
- 6న హరీష్ రావు, 9న ఈటల హాజరుకు నోటీస్లు

**హైదరాబాద్,** మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
కాళేశ్వరం కమిషన్ దూకుడు పెంచింది. ఇంతకాలం అధికారులను విచారించిన కమిషన్ ...ఇప్పుడు ఇందులో కీలకంగా ఉన్ననేతలను విచారణకు పిలుస్తోంది. ఈ క్రమంలో భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఆయనతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌కూ -మిగతా 2 లో



## వక్ఫ్ చట్టంపై మరోమారు సుప్రీం విచారణ

- ప్రతిపాదిత మూడు అంశాలపైనే విచారణ
- సుప్రీంను కోరిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,** మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఏదైనా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తే.. దాన్ని మూడు అంశాలకే పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. వక్ఫ్ చట్టంపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం -మిగతా 2 లో

## తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షాలే..!

- ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..!

**హైదరాబాద్**మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
తెలంగాణలో రాగల నాలుగు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ద్రోణి ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాబోయే మూడురోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, -మిగతా 2లో





## చట్టం ముందు అందరు సమానమే

- కాళేశ్వరం విచారణకు కేసీఆర్ హాజరు కావాలి
- మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్య

**పెద్దపల్లి,**
కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరు కావాలని,వివరాలు వెల్లడించాలని తెలంగాణ ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నోటీసులు ఇప్పుడే కదా ఇచ్చింది.. ఆయన వెళ్తారనే తాను అనుకుంటున్నానన్నారు. -మిగతా 2 లో

### పెంచిన మెట్రో ఛార్జీల్లో


## స్వల్పంగా తగ్గింపు

పెంచిన ధరలపై 10 శాతం చార్జీలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్,**
నగర వాసులకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గుడ్ న్యూస్ చెప్పింది. ఇటీవల మెట్రో చార్జీలను భారీగా పెంచిన యాజమాన్యం కాస్తా దిగొచ్చింది. -మిగతా 2 లో

## తిరుమలలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం



- 42 అతిథి గృహాల పేర్లు మార్పునకు నిర్ణయం
- తిరుమల కొండల్లో పచ్చదనం పెంచేందుకు చర్యలు
- టిటిడి బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

**తిరుమల,** మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
తిరుమలలో యాంటీ డ్రోన్ టెక్నాలజీ వాడుకోవాలని నిర్ణయించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వెంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట ఆలయాల -మిగతా 2 లో

### భూ సమస్యల శాశ్వత

# పరిష్కారమే లక్ష్యం

### జూన్ 2నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే

- కొత్తగా 6 వేల మంది సర్వేయర్ల నియామకం
- భూభారతి చట్టంతో భూయజమానులకు హక్కు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**పెద్దపల్లి,** మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
భూ సమస్యల శాశ్వత పరిష్కరారానికి కొత్తగా భూ భారతి చట్టం తీసుకొచ్చామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వేలు ప్రారంభం అవుతాయని, ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలో రెవిన్యూ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని తెలిపారు. అందుకోసం 6 వేల మంది సర్వేయర్లను కొత్తగా నియమిస్తున్నట్లు- చెప్పారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో భూ భారతి రెవిన్యూ అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రతి సర్వే నెంబర్ ను తెలిపేలా భూములకు భూదార్ కార్డులు ఇస్తామని ఈ సందర్భంగా చెప్పారు. భూ సమస్యల -మిగతా 2 లో

## “నీలగిరి ఎక్స్‌ప్రెస్” కథనానికి అధికారుల్లో స్పందన

- పార్కింగ్,దర్శనము కు డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించం..
- ఆలయ ఈఓ, కలెక్టర్ పై దేవాదాయ శాఖ సీరియస్


నీలగిరి ఎక్స్‌ప్రెస్
www.neelagiriexpress.in
19 May 2025 - Page 1

సరస్వతి పుష్కరాల్లో
పుష్కలమైన దోపిడి

- సాధువులు వచ్చిన ప్రవేశ పన్ను కట్టాల్సిందే
- సౌకర్యాలు సున్నా చార్జీల వసూళ్లలో మిన్న
- దర్శనం,పార్కింగ్ కు 500 వసూలు
- సాధువులను అవమానించిన ఆలయ ఈఓ

హైదరాబాద్,మే 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హయాంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని సనాతన,హిందూ బంధుల మెప్పు పొందాలని భావించారు అందుకే ఏర్పాట్లలో లోటు రాకుండా భక్తులు ఇబ్బంది పడకుండా దాదాపు 40 కోట్లు కేటాయించారు కానీ పుష్కరాలు అలా ప్రారంభం
-మిగతా 2 లో




**హైదరాబాద్** మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
సరస్వతి పుష్కరాల్లో పుష్కలమైన దోపిడి అంటూ నీలగిరి ఎక్స్ ప్రెస్ దినపత్రిక ఓ కథనం ప్రచురించింది దానిపై స్పందించిన తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సరస్వతి పుష్కరాల్లో ఎవరు పార్కింగ్ కు దర్శనం టికెట్ కు డబ్బులు వసూలు చేసిన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

# కాళేశ్వరం కమిషన్ దూకుడు

(మొదటి పేజి తరువాయి)

జారీ చేసింది. 15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరుకావాలని పేర్కొంది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరికీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు హాజరుకావాలని పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో దీంతోపాటు– అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పా–టైన ఈ కమిషన్.. నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ–కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణసంస్థల ప్రతినిధులు.. ఇలా అందరినీ విచారించింది. ఎప్పటికప్పుడు అవసరానికి తగ్గట్లుగా ప్రభుత్వం 7 సార్లు కమిషన్ గడువును పొడిగించింది. గత నెలాఖరులో ఒక నెల మాత్రమే గడువు పొడిగించింది. దీనిప్రకారం ఈ నెలాఖరుకు కమిషన్ గడువు పూర్తికావాలి. ఈ నెల 21న లేదా 22న జస్టిస్ పీసీ ఘోష్ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారనే ప్రచారం జరిగింది. అయితే విచారణలో.. సీనియర్ ఇంజినీర్లు, అధికారుల్లో ఎక్కువమంది గత ముఖ్యమంత్రి సమక్షంలో నిర్ణయాలు జరిగాయని, ఆయన ఆదేశాల మేరకే పలు నిర్ణయాలను అమలుచేశామని చెప్పిన నేపథ్యంలో.. వీటిపై కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలనే నిర్ణయంతో కమిషన్ ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరం నిర్మాణం వ్యవహారం లో నిజాన్ని నిగ్గు తేల్చాల్సిందిగా జస్టిస్ పీసీ ఘోష్ అధ్యక్షతన కమిషన్‌ను ఏర్పాటు– చేసింది. దాదాపు ఏడాదిన్నరగా కమిషన్ విచారణ కొనసాగుతోంది. కమిషన్ విచారణ గడువు ఈ నెలాఖరితో ముగియనుంది. అయితే కమిషన్ గడువును ప్రభుత్వం మరో రెండు నెలలపాటు అంటే జూలై 31 వరకు పొడిగిచింది. కమిషన్ విచారణలో భాగంగా బ్యారేజీ నిర్మాణంలో పనిచేసిన ఏఈలు, డీఈలు, ఎస్‌ఈలతో పాటు– రాష్ట్ర స్థాయి అధికారులందరినీ కమిషన్ విచారించింది. వారి నుంచి అఫిడవిట్లరూపంలో వాంగ్మూలాన్ని స్వీకరించి.. వాటిని క్రాస్ ఎగ్జామిన్ చేయడంతో పాటు బహిరంగంగా విచారించింది. ప్రాజెక్టులను నిర్మించిన కంపెనీల ప్రతినిధులను కూడా విచారించింది. అలాగే ప్రాజెక్ట్ డిజైన్లు చేసిన కంపెనీల ప్రతినిధులను కూడా కమిషన్ విచారణ చేసింది. ఈ ఏడాది పాటు– సుదీర్ఘంగా జరిపిన ఈ విచారణలో దాదాపు అందరూ కూడా కేసీఆర్ పేరే చెప్పినట్లు తెలుస్తోంది. బ్యారేజీకి సంబంధించిన స్థలాల ఎంపికను ఎవరు చేశారని ప్రశ్నించగా..ప్రధానంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేరునే ప్రస్తావించినట్లు సమాచారం. స్థలాల ఎంపిక, బ్యారేజీలకు సంబంధించి కీలక నిర్ణయాలు, చెల్లింపుల నిర్ణయాల్లో కూడా ఆనాటి సీఎం కేసీఆర్, అప్పటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ ప్రమేయంతో జరిగినట్లు– ప్రాథమిక నిర్ధారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వచ్చినట్లు– తెలుస్తోంది. అలాగే కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపు తుది దశకు చేరుకుంది. ఇప్పటి వరకు వచ్చిన వివరాలతో ఓ నివేదికను కూడా సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయకుండా నివేదిక ఇస్తే బీఆర్ఎస్ తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉందని భావించిన కమిషన్.. కేసీఆర్‌ను స్వయంగా విచారించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే కేసీఆర్ సహా హరీష్, ఈటలకు నోటీసులు పంపించింది. అయితే కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా లేక న్యాయపరంగా ఎదుర్కుంటారా అనేది చర్చనీయాంశంగా మారింది.

# వక్ఫ్ చట్టంపై మరోమారు సుప్రీం విచారణ

(మొదటి పేజి తరువాయి)

తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరఫున వాదనలు వినిపిస్తూ.. గత బెంచ్ లాగానే విచారణను పరిమితం చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనానికి తెలిపారు. కోర్టు మూడు అంశాలను గుర్తించిందని తుషార్ మెహతా తెలిపారు. ఆ మూడు అంశాలపై సమాధానం ఇచ్చామని.. తాజాగా పిటిషనర్లు లిఖితపూర్వక సమర్పణల్లో అనేక ఇతర అంశాలను లేవనెత్తుతున్నారన్నారు. తాము మూడు అంశాలపై అఫిడవిట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలనేది కేంద్రం తరఫున విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ వాదనను పిటిషనర్లు వ్యతిరేకించారు. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి సొలిసిటర్ జనరల్ వాదనను వ్యతిరేకించారు. ఇంతకు ముందు ఏప్రిల్ 17న జరిగిన విచారణలో వక్ఫ్ బై–యూజర్‌తో సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీ–నోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అలాగే, వక్ఫ్ బోర్డులలో కొత్త నియామకాలు చేపట్టబోమని సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా.. మూడు అంశాల విషయానికి వస్తే.. వక్ఫ్ బై యూజర్ లేదంటే.. వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారం కాగా.. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లింలు వ్యతిరేకించడం రెండో అంశం కాగా.. మూడో అంశం నిబంధనకు సంబంధించింది. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్ అధికారం ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం మంగళవారంనాడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేననే భావన ఉందని, స్పష్టమైన సందర్భం వెల్లడి కానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోకూడదని అన్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదన్నారు. అంతకన్నా తాము చెప్పవలసిన అవసరం లేదని చెప్పారు. వక్ఫ్‌ను స్వాధీనం చేసుకోవడం ఈ చట్టం ఉద్దేశమని పిటిషనర్ల తరఫు లాయర్ కపిల్ సిబాల్ అన్నప్పుడు సీజేఐ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ చట్టంపై గత విచారణ సందర్భంగా, మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించమని, ఈ మూడు అంశాలపై వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోమని సుప్రీంకోర్టుకు గత విచారణలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

## తిరుమలలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం

(మొదటి పేజి తరువాయి)



అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారీకి ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం తీసుకున్నారు. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సమావేశమైన ధర్మకర్తల మండలి పలు కీలక నిర్ణతీసుకుంది. సమావేశం అనంతరం ధర్మకర్త మండలి నిర్ణయాలను ఈవో శ్యామలరావు మీడియాకు వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో ఉన్న పచ్చదనాన్ని అటవీశాఖ ద్వారా 68.14 శాతం నుంచి 80శాతానికి పెంచేందుకు నిర్ణయం తీసుకున్నట్టు– తెలిపారు. అటవీ ప్రాంతంలో పచ్చదనం పెంచేందుకు తితిదే రూ.4 కోట్లు ఇచ్చేందుకు పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. ఇకపోతే తితిదే ఉప ఆలయాల సమగ్ర అభివృద్ధికి కమిటీ– ఏర్పాటు చేయనున్నారు. తిరుమలలో 42 వీఐపీ అతిథి గృహాలు ఆధ్యాత్మిక పేర్లు మార్చారు. రెండు అతిథిగృహాల పేర్లు మార్చలేదు.. వాటికి తితిదేనే పేర్లు మార్చనుంది. ఆకాశగంగ, పాపవినాశం, కాలికనడక మార్గాల్లో మెరుగౌన సౌకర్యాల కల్పనకు కమిటీకి అప్పగించారు. స్విమ్స్ ఆసుపత్రిలో 597 పోస్టుల భర్తీకి ఆమోదం ఇచ్చింది. ఒంటిమిట్ట ఆలయంలో నిత్య అన్నదానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలోని బిగ్ క్యాంటీ–న్లు, జనతా క్యాంటీ–న్ల లైసెన్స్ ఫీజు నిర్ణయానికి ఆమోదం. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. తితిదేలో పనిచేస్తున్న అన్యమతస్తులను బదిలీ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, స్వచ్ఛంద పదవీ విరమణకు చర్యలు తీసుకునేందుకు ఆమోదం ఇచ్చింది. తుళ్లూరు మండలం అనంతవరంలోని తితిదే ఆలయం అభివృద్ధికి రూ.10 కోట్లు– కేటాయించేందుకు ఆమోదం ఇచ్చింది. శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్స్ట్ లెవెల్ చిత్ర బృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

## వలిగొండ తహసీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన దశరథ



**మే 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) వలిగొండ (ప్రతినిధి )**

వలిగొండ మండల తహసీల్దార్‌గా జి దశరథ మంగళవారం బాధ్యతలను చేపట్టారు.బదిలీల్లో భాగంగా చండూరు నుండి వలిగొండకు బదిలీ అయ్యారు.చండూరు మండలం నుంచి విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ కే శ్రీనివాస్ రెడ్డి పోచంపల్లికి బదిలీ పై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం ఆదాయ ధ్రువ పత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. అనంతరం సిబ్బంది అందరూ తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ పల్లవి సీనియర్ అసిస్టెంట్ మనోహర్ ఆర్ ఐ లు కరుణాకర్ రెడ్డి నాగేష్ జూనియర్ అసిస్టెంట్ శివాజీ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు

## పహల్గామ్ పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయారు

(మొదటి పేజి తరువాయి)

ఆ తర్వాతే ఆయన తన పర్యటనను రద్దు చేసుకున్నారని ఖర్గే మరోసారి అన్నారు. దాడి జరిగే అవకాశం ఉందని ప్రజలకు ముందే ఎందుకు తెలియజేయలేదు అని ప్రశ్నించారు. కర్ణాటకలో జరిగిన సమర్పణే సంకల్ప ర్యాలీలో పాల్గొన్న ఖర్గే మాట్లాడుతూ.. ప్రధాని మోడీ ఏప్రిల్ 17న కాశ్మీర్‌లో పర్యటించి ఉండాల్సింది, కానీ నిఘా వర్గాల సమాచారం మేరకు రద్దు చేసుకున్నారని, దీని గురించి మీకు ముందే తెలుసా..? అని ప్రధానిని ప్రశ్నించారు. దీని గురించి ఎందుకు ప్రజలకు సమాచారం ఇవ్వలేదు, ముందే హెచ్చరించి ఉంటే 26 మంది ప్రాణాలను కాపాడగలిగే వాళ్లం అని అన్నారు. ఇప్పుడు అక్కడక్కడ చిన్న యుద్ధాలు జరుగుతున్నాయి. పాకిస్తాన్ చైనా మద్దతుతో భారతదేశాన్ని తక్కువ అంచనా వేస్తోందని అన్నారు. 26మంది పౌరులు మరణించగా, ప్రధాని మోదీ బీహార్‌లో ర్యాలీ నిర్వహించడంలో బిజీగా ఉన్నారు. రెండు అఖిలపక్ష సమావేశాలు జరిగాయి, ప్రధానమంత్రి కూడా హాజరు కాలేదు. మేము ఆ సమావేశాలకు దూరంగా ఉంటే, మమ్మల్ని దేశద్రోహులుగా పిలుస్తారు. కానీ మోదీ వాటిని సమావేశాలకు రాకుంటే, దానిని దేశభక్తిగా ముద్ర వేస్తారు. ఈ ద్వంద్వ ప్రమాణాలు ఎందుకని ఖర్గే ప్రశ్నించారు.

## తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షాలే..!

(మొదటి పేజి తరువాయి)

నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించింది ఐఎండీ. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. అలాగే భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ వానలు పడుతాయని చెప్పింది. అలాగే, ఈ నెల 23, 24 తేదీల్లో ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ వివరించింది.

## పెంచిన మెట్రో ఛార్జీల్లో స్వల్పంగా తగ్గింపు

(మొదటి పేజి తరువాయి)

తాజాగా మెట్రో రైలు సంస్థ టికెట్ ధరలను సవరించింది. మంగళవారం మెట్రో చార్జీలను తగ్గిస్తున్నట్లు– ప్రకటించింది. పెంచిన ధరలపై 10 శాతం చార్జీలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తగ్గించిన టికెట్ ధరలను మే 24వ తేదీ నుండి అమలులోకి తీసుకురానున్నట్టు– వెల్లడించింది. కాగా, ఇటీ–వల కనిష్టంగా ఉన్న రూ.10 టికెట్ ధరను 12 రూపాయలకు పెంచింది. గరిష్టంగా ఉన్న 60 రూపాయల టికెట్ ధరను 75 రూపాయలకు పెంచిన సంగతి తెలిసిందే.

# చట్టం ముందు అందరు సమానమే

(మొదటి పేజి తరువాయి)


అయితే చట్టం ముందు అందరూ సమానమేనని ఆయనని చెప్పారు. కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో శ్రీధర్ బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం పెద్దపల్లిలో మంత్రి శ్రీధర్ బాబు విలేకర్లుతో మాట్లాడుతూ.. తప్పు చేయకపోతే భయం ఎందుకు అంటూ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరంలో తనపై కేసీఆర్ పెట్టిన కేసులు ఎదుర్కొన్నానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన తప్పేం లేదంటూ కేసును కోర్టు కొట్టేసిందన్నారు. ఎనిమిదేళ్ల పాటు.. ఈ కేసులతో పోరాడానని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మరోవైపు గత కేసీఆర్ ప్రభుత్వం లక్షల కోట్లాది రూపాయలు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించింది. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ ప్రాజెక్ట్‌లోని కొన్ని పిల్లర్లు కుంగాయి. ఈ నేపథ్యంలో దీనిని నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రచారాస్త్రంగా మలుచుకొంది. తాము అధికారంలోకి వస్తే.. దీనిపై విచారణ జరిపిస్తామని ప్రకటించింది. ఇక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో జస్టిస్ పిసి ఘోష్ సారథ్యంలో కమిషన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

పరిష్కారం కోసం అధికారులు గ్రామాల్లోకి వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో పేద వారిని ఇబ్బంది పెట్టకుండా రెవిన్యూ అధికారులు పని చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రతి నిరుపేదకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతి నియోజకవర్గానికి సంవత్సరానికి 3 వేల 5 వందల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశానికే ఆదర్శమని ఐటీ– శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. భూ భారతి రెవిన్యూ అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన.. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ బాగాలేకున్న సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపడం లేదన్నారు. పేదవారిని ఇబ్బంది పెట్టకుండా రెవిన్యూ అధికారులు పని చేయాలని ఆదేశించారు.

## 2025 మే 21, బుధవారం తెలుగు పంచాంగం



మాసం - పక్షం
మాసం: వైశాఖమాసం (అమాంత)
పక్షం: కృష్ణపక్షం
తిథి
నవమి: మే 21, ఉదయం 4:55 నుండి మే 22, తెల్లవారుజామున 3:19 వరకు
నక్షత్రం
శతభిషం: మే 21, సాయంత్రం 6:58 వరకు
పూర్వాభాద్ర: మే 21, సాయంత్రం 6:58 నుండి మే 22, సాయంత్రం 6:05 వరకు
సూర్యోదయం - సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 5:46
సూర్యాస్తమయం: సాయంత్రం 6:38
చంద్రోదయం -చంద్రాస్తమయం
చంద్రోదయం: రాత్రి 12:58
చంద్రాస్తమయం: మధ్యాహ్నం 12:14
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:10 నుండి 4:58 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:46 నుండి 12:38 వరకు
అమృతకాలం: మధ్యాహ్నం 12:01 నుండి 1:38 వరకు
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 12:13 నుండి 1:50 వరకు
యమగండం: ఉదయం 7:22 నుండి 8:59 వరకు
దుర్ముహూర్తం:
ఉదయం 11:00 నుండి 11:52 వరకు
మధ్యాహ్నం 2:15 నుండి 3:06 వరకు
వర్జ్యం: రాత్రి 9:37 నుండి 11:14 వరకు

# బాల్యమిత్రుడికి స్నేహితుల చేయూత



**ఆమనగల్లు, మే 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న స్నేహితుడికి బాల్య మిత్రులు తోడ్పాటును అందించారు. అధైర్య పడవద్దు తామున్నామని మనోధైర్యం కల్పించారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది అనంతరం ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు చింతలపల్లి గ్రామంలో లక్ష్మారెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య చికిత్సల నిమిత్తం ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు , బాల్యమిత్రుడు అండే కార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూ. 20 అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎంగలి రఘు, కోట రాములు, నిరంజన్, రాములు, చంద్రమౌళి తదితరులున్నారు .

# భవిత కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి



**కరీంనగర్, మే 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ముఖరంపుర లోని భవిత సెంటర్ ను సోమవారం సందర్శించారు. ఇక్కడ పెయింటింగ్ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పిల్లలను ఆకట్టుకునేలా పెయింటింగ్ పనులు చేపట్టాలని అన్నారు. సెంటర్ చుట్టూ పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాలని, పిల్లలు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధన కోసం అవసరమైన అన్ని పరికరాలు, స్టడీ మెటీరియల్ తెప్పించాలని ఆదేశించారు. రెయిలింగ్, ర్యాంపు రాంప్ వంటివి పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ఫిజియోథెరపిస్టు కచ్చితంగా కేంద్రానికి వచ్చేలా చూడాలని అన్నారు. జిల్లాలోని హుజురాబాద్, చొప్పదండి, మానకొండూర్, తిమ్మాపూర్ భవిత కేంద్రాల్లోనూ ఇదే విధంగా పెయింటింగ్ పనులను చేయించాలని అన్నారు. భవిత సెంటర్లలో వాల్ పెయింటింగ్స్, ప్లే వే మెటీరియల్ ఏర్పాటు చేయడంతో పాటు చదువుకోవడానికి, ఆటలాడుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. భవిత సెంటర్ల ఆధునీకరించే పనులు త్వరగా పూర్తిచేసి జూన్ 1 నుండి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. దివ్యాంగ విద్యార్థులను ఈ కేంద్రాల్లో చేర్పించి వారి మనోవికాస అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిసిడివో కృపారాణి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కురి శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో బీసీ వసతిగృహాన్ని అందుబాటులోకి తీసుకువస్తాం





-త్వరలో నిర్మాణం ప్రారంభం
-ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి





**ఆమనగల్లు, మే 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఆమనగల్లు పట్టణంలోని మాడుగుల రహదారిపై ఉన్న బీసీ బాలుర వసతిగృహం త్వరలోనే ఆధునిక హంగులతో ముస్తాబై విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డా. మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం వెల్లడించారు. గత ఆరేళ్లుగా శిథిలావస్థలో ఉండి ఉపయోగానికి నోచుకోని ఈ భవనాన్ని తిరిగి జీవం పోసేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు విజ్ఞప్తిపై స్పందించిన ఈ నేతలు%ॐ% వసతిగృహ స్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో వారు చర్చించారు. కలెక్టర్ సూచన మేరకు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశవరాం స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం వసతిగృహానికి 21 గుంటల భూమి (సుమారు 2,500 గజాలు) ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు బీసీ గురుకుల విద్యాలయం, బీసీ వసతిగృహాల నిర్మాణానికి సంబంధించి ఇంజినీరింగ్ శాఖ అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న ఆదేశాలు జారీయ్యాయి. "ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి, నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటాం. విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం," అని ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలాజీ సింగ్, తహసీల్దార్ సిహెచ్. లలిత, పార్లమెంట్ ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వసుపుల మానయ్య, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మండ్లీ రాములు, మెకానిక్ బాబా, శ్రీను నాయక్, మహేష్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులపై గ్రామ సభ





**మనోహరబాద్, మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మెదక్ జిల్లా మనోహరబాద్ గ్రామంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనుల పై గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ సెక్రటరీ స్వామి గౌడ్, డి.ఆర్.పి నాగయ్య, ఏ.పి.ఓ ఆది నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు. అలాగే, ఉపాధి హామీ కూలీలు కూడా హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధికి అవసరమైన పనుల ప్రణాళిక,కూలీలకు అందించాల్సిన వేతనాలు,పని నాణ్యత వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన విధానాల ప్రకారం ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు.

# ఎదిరే నాగమ్మ అకాల మరణం

**జడ్చర్ల, మే 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

లింగంపేట్ గ్రామానికి చెందిన ఎదిరే నాగమ్మ మే 12, 2025న అనారోగ్యంతో కన్నుమూశారు. మే 22న ఉదయం 10:30 గంటలకు లింగంపేట్ గ్రామంలో దశదినకర్మ నిర్వహించనున్నట్లు నాగమ్మ మనవడు,తెలంగాణ అసైన్డ్ భూమి సమితి రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ చిక్కిరి శ్రీకాంత్ పేర్కొన్నారు.

# అథారిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క,ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల,మే20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ఈరోజు హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి సీతక్క కార్యాలయంలో పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధ్యక్షతన నిర్వహించిన వాల్టా రాష్ట్రస్థాయి అథారిటీ సమావేశం లో పాల్గొన్న చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య. తెలంగాణ వాటర్ లాండ్ అండ్ ట్రీస్ యాక్ట్, 2002 కు అనుగుణంగా జిల్లా స్థాయి అథారిటీల ఏర్పాటు, పర్యావరణము సహజ వనరుల పరిరక్షణ కోసం ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, టీజీ వోల్టా ఫండ్ ఏర్పాటు, అధిక నీటి వినియోగ గ్రామాల నోటిఫికేషన్ తదితర అజెండా అంశాల పై చర్చలు జరిపారు.ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, పర్యావరణ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ




**కల్వకుర్తి, మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్లో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఎంపికైన మహిళలకు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబే దుల్లాలు కోత్వాల్ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 150 కుట్టు మిషన్లు మంజూరు ఐనవి అని తెలిపారు అదేవిధంగా మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్ద పీఠం వేస్తుందని అన్నారు మహిళా మణులకు అర్హులు ఐన వారి అందరికీ అందజేస్తామని వారు తెలిపారు విడతలవారీగా అందరికీ సమానత్వంగా అందిస్తాం అని ఎంపీ మల్లు రవి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ విజయకుమార్ రెడ్డి, అధికారులు, స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్ లో జరిగిన సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే



**అచ్చంపేట,మే 20( నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

అమ్రాబాద్ మండల పరిధిలోని మాచారం గ్రామంలో, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన, ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని ప్రారంభించిన, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అచ్చంపేట నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు, అచ్చంపేట నియోజకవర్గం పైలెట్ ప్రాజెక్టు ఎంపిక శుభ పరిణామం. నిన్నటి భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన, అచ్చంపేట నియోజకవర్గం ప్రజలు, మరియు అధికారులు ప్రజాప్రతినిధులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, కు రాష్ట్ర జిల్లా అధికారుల కు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు గందె సురేష్‌కు ఘన సన్మానం



**చేవెళ్ల, మే20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చేవెళ్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతనం అధ్యక్షునిగా ఎన్నికైన గందె సురేష్ కు ఘన సన్మానం జరిగింది. అధ్యక్షునితో పాటు కమిటీ సభ్యులు జిల్లా యువజన సంఘం కోశాధికారి నీల రవీందర్, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, అన్మారి మురళి, మెంబర్షిప్ కమిటీ మలిపెద్ది శ్రీనివాస్ తదితరులు ప్రతి మండల కేంద్రాన్ని సందర్శిస్తూ చేవెళ్లకు విచ్చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది వెంకటేశం గుప్తా, కోశాధికారి మలిపెద్ది రమేష్ గుప్తా,జిల్లా సభ్యులు శ్రీరామ్, సత్యం, మామిడి భద్రసేన,అలాగే చేవెళ్ల సంఘ సభ్యులు ఉడుత రఘు గుప్త, ఇంద్రసేన, మందుల శ్రీనివాస్, వీరేందర్ గుప్తా, గడ్డం నాగరాజు, రెడ్డి శెట్టి రఘు, ప్రశాంత్, వీరేశం, కొంచెం నవీన్, విజయ్, రమేష్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమంలో గందె సురేష్ గుప్తా మాట్లాడుతూ నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

## ఉపాధ్యాయులు ఐకమత్యం తో పని చేయాలి

**– వయోజన విద్య డైరెక్టర్ ఉషారాణి**



**యాదాద్రి మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని, విద్యార్థులకు నూతన పద్ధతుల ద్వారా భోదించాలని వయోజన విద్య డైరెక్టర్ ఉషారాణి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని జమీలాపేట్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణా శిభిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ భోధనా విధానాన్ని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ విద్యార్థులకు బోధించాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలని, లోపాలను సరిచేస్తూ శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణా శిభిరంలో 134 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కె .సత్యనారాయణ , ఎంఈఓ జి .సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

### చందన వెల్లి గ్రామానికి చెందిన నలుగురు మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే "కాలే యాదయ్య"





**చేవెళ్ల,మే20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాబాద్ మండలం చందన వెల్లి గ్రామ వాసులు శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా పరిగి మండలం రంగాపూర్ సమీపంలో నేషనల్ హైవే పై రాత్రి ప్రమాదవశాత్తూ ఘోర రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై వికారాబాద్ లోని ఈషా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న దగ్గరికి వెళ్ళి, పరామర్శించిన చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య,అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలన్నారు.అదే యాక్సిడెంట్ లో నలుగురు వ్యక్తులు మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే . పరిగి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని, కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## కమ్యూనిటీ హాల్ స్థలానికి ఎమ్మెల్యే హామీ



**మంచాల, మే 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డిను మంచాల మండల నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు కలిసి కమ్యూనిటీ హాల్ స్థలం కోసం వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే మండల కేంద్రంలో హాల్ స్థలం కేటాయిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే, నాయి బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వింజమూరి రామిరెడ్డి, రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల రాజు, మాజీ ఎంపీటీసీలు ఎడమ నరేందర్ రెడ్డి, కావలి శ్రీనివాస్, సహకార బ్యాంక్ డైరెక్టర్ జెనిగా వెంకటేష్, పంది రమేష్, వి ఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అశ్వల బాల్ రాజ్, ప్రధాన కార్యదర్శి అశ్వల వెంకటేష్, గౌరవ అధ్యక్షుడు ఏనుధుల సురేష్, కోశాధికారి దేవరకొండ రమేష్, మండల చైర్‌పర్సన్ అశ్వాల నరసింహ, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల వెంకటేష్, నాయకులు మాదరమణి, జంగయ్య గౌడ్, రావుల భాషయ్య, కావలి బుగ్గ రాములు, సంఘం నాయకులు ఆమంచ మల్లయ్య, దేవరకొండ సత్యనారాయణ, ఆమంచ సురేష్, అశ్వాల జంగయ్య, శ్రీను, జగన్, శ్రీను బాలరాజ్, ఆమంచ మధు, జంపాల శంకర్, దేవరకొండ రామకృష్ణ, ఆంజనేయులు, అశ్వల ముత్యాలు, రఘు, రమేష్, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.
అన్నివేళలా మీతో పాటు ఉంటుంది
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.
మీ గొంతుకకు మేమే వేదిక – నీలగిరి ఎక్స్‌ప్రెస్!

# టి. డబ్ల్యూ. జె. ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం

**–జర్నలిస్టులకు అక్రిడిషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి**
**–టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్**



**వనపర్తి,మే 21( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో మంగళవారం రోజు సీనియర్ జర్నలిస్టు అంబటి స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జర్నలిస్టు సభ్యత్వ నమోదు కార్యక్రమం లో టి .డబ్ల్యూ .జే.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ ముఖ్య అతిథిగా హాజరై సభ్యులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య కల్పించాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల కోసం టి డబ్ల్యూ జేఎఫ్ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. టి డబ్ల్యూ జి ఎఫ్ యూనియన్ సభ్యులందరికీ ఎల్లవేళలా అన్ని రకాలుగా యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు మే 29వ తేదీన వనపర్తి జిల్లా మహాసభల సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లాలో ఉన్న జర్నలిస్టులు ఈ సన్నాహక సమావేశానికి హాజరు కావాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, రామకృష్ణారెడ్డి, శేఖర్, రాములు, బాబు, విష్ణువర్ధన్ సాగర్, బాల ముకుంద, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం.

**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి .**



**వనపర్తి , మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
కాంగ్రెస్ పార్టీ వనపర్తి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు వనపర్తి పట్టణంలోని కళ్యాణ్ సాయి గార్డెన్స్ లో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విస్తృత సాయి సమావేశాన్ని విజయవంతం చేద్దామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పత్రికలకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కాంగ్రెస్ పార్టీ దశా, దిశా నిర్దేశానుసారం సంస్థాగతంగా చేపట్టేటువంటి సమావేశానికి టి పి సి సి పర్యవేక్షకులు సతీష్ , సంజీవ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి , నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పాల్గొననున్నారు. ఈ సమావేశానికి వనపర్తి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల, గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పెద్దలు, నాయకులు, కార్యకర్తలతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ , వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , డిసిసిబి జిల్లా అధ్యక్షులు మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి , జిల్లా గ్రంధాలయాల చైర్మన్ గోవర్ధన్ సాగర్ , పెబ్బేర్ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదని రెడ్డి , పీసిసిసభ్యులు శంకర్ ప్రసాద్ ,ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మండల అధ్యక్షులు, సింగిల్ విండో అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఎన్ ఎస్ యు ఐ సంఘం నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి విజ్ఞప్తి చేశారు.

## పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన మిగిలిపోయిన భూసేకరణ సర్వే పనులు వేగవంతం చేయాలి

**ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి రవి నాయక్**



**వనపర్తి,మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)::**
పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిపోయిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి. రవి నాయక్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే ల్యాండ్ అధికారులతో ఇరిగేషన్ భూసేకరణ అంశము పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ వర్షాకాలం వచ్చేస్తే రైతులు పంటలు వేసుకుంటారని అప్పుడు సర్వే చేయడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. అందువల్ల వారం పదిహేను రోజుల్లో మిగిలిపోయిన భూసేకరణకు సర్వే పూర్తి చేయాలని సూచించారు. సర్వే చేసేందుకు సర్వే ల్యాండ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వెళ్లి పూర్తి చేయాలని ఆదేశించారు. గోపాలపేట, బుద్ధారం, ఘనపూర్, రేవల్లి తదితర మండలాల్లో చేయాల్సిన భూసేకరణ పై కూలంకషంగా చర్చించారు. రైతులను ఒప్పించి సర్వే పూర్తిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలో ఇరిగేషన్ కు సంబంధించి భూసేకరణ సకాలంలో పూర్తి చేసి ఆయకట్టు పెంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. 15 రోజుల్లో సర్వే చేయించి అవార్డు స్టేజి కి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఎస్. ఈ ఇరిగేషన్ సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, డి. ఈ లు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ అధికారులు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి

**-సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**




**చేవెళ్ల,మే20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం సిఐటియు చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిరసన తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లిసిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తున్నదని అన్నారు గత 100 సంవత్సరాలలో కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ ముందుకు తెచ్చిందని అన్నారు 2025 -26 బడ్జెట్లో తమ కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసిందని అన్నారు ఉపాధి, నిరుద్యోగం,అధిక ధరలు,ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోవడంలేదని అన్నారు వెంటనే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో లిలిసిఐటియు శంకర్పల్లి మండల కన్వీనర్ మల్లేష్, షాబాద్ మండల కన్వీనర్ నరసింహ, గ్రామపంచాయతీ యూనియన్ చేవెళ్ల మండల అధ్యక్షుడు దుద్దాగు నరసింహ గ్రామపంచాయతీ యూనియన్ షాబాద్ మండల కార్యదర్శి నరసింహ నాలుగు మండలాల అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు, అంగన్వాడి టీచర్లు ఆయమ్మలు, మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

**నాంపల్లి మే20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎన్టీఆర్ ఫ్యాన్స్ తెలంగాణ రాష్ట్ర స్టేట్ వైడ్ కన్వీనర్ వేముల నర్సన్న ఆదేశాల మేరకు ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ దేవరకొండ డివిజన్ అధ్యక్షులు దానబోయిన నరేష్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కి నేను వీరాభిమాని ఎందుకంటే ఆయన సమాజం పట్ల చేసే అవగాహనలు ఆయన మాట్లాడే విధానం ఆయన చేసే పనిలో నిజాయితీ ఉంటేనే సినిమా చేస్తాడని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు చోటు, మధు, మనీ, సాయి, తదితరులు పాల్గొన్నారు

# యాదాద్రి ఆలయంలో కేసీఆర్ మనువడు కల్వకుంట్ల హిమాన్షు



**యాదాద్రి,మే 20 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )** బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మనువడు కల్వకుంట్ల హిమాన్షు మంగళవారం ఉదయం యాదాద్రి లక్ష్మీ నరసింహాస్వామిని దర్శించుకున్నారు. హిమాన్షు తన స్నేహితులతో కలిసి యాదాద్రి ఆలయానికి చేరుకున్నారు. దర్శనం అనంతరం కల్వకుంట్ల హిమాన్షుకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్వకుంట్ల హిమాన్షు వెంట మాజీ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# ట్రెండ్ సెట్ అంతే.. ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం.. ఇదో అద్భుతం..

**- నీలగిరి ఎక్స్ ప్రెస్ ప్రత్యేక కథనం**



**హైదరాబాద్, మే 20( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మనం ఇప్పటివరకు చూశాం. చిన్నప్పుడు స్కూళ్లలో కలిసి చదువుకున్న పిల్లలు.. ఉన్నత చదువులు అయ్యి.. స్థిరపడ్డాక ఇలా సమ్మేళనాలు నిర్వహిస్తూ ఉంటారు. అయితే.. ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం గురించి మీరెప్పుడైనా విన్నారా..? ఆ డీటేల్స్ మీ ముందుకు తీసుకొచ్చాం.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.. ఇలాంటి కలయిక సర్వసాధారణం.. ఒకే బడిలో 10వరకు చదువుకున్న విద్యార్థులు కొన్నేళ్ల తరువాత తిరిగి మళ్లీ కలుసుకుని జరుపుకునే గొప్ప వేడుక.. అపూర్వ కలయిక. అదో అద్భుత ఘట్టమనే చెప్పాలి. ఎందుకంటే.. ఏమీ తెలియని పసితనంతో పదేళ్లపాటు కలిసి చదువుకున్న పిల్లలంతా తిరిగి పెద్ద వయసులో కలుసుకున్న ఆ క్షణాలు ఊహకందని ఆనందనిస్తుంటాయి. చిన్నతనంలో వారు చేసిన అల్లరి, ఆటపాటలు నెమరు వేసుకుంటూ ఆనాటి ఆనంద క్షణాలను గుర్తు చేసుకుంటూ ఉంటారు. అయితే, మీరు ఎప్పుడైనా ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం అనే మాట విన్నారా ? కానీ, కొత్తగా అలాంటి ఒక వినూత్న సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు మన కొల్లూరు ఆడిబిడ్డలు. అవును మీరు మీరు విన్నది నిజమే.. యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో ఆడబిడ్డలు జరుపుకున్న ఓ వేడుక ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షించింది. ఒకే ఊరిలో పుట్టి పెరిగిన ఆడపిల్లలంతా ఒక చోట చేరి జరుపుకున్న సంబరం ఆ ఊరందరినీ ఆశ్చర్యపోయేలా చేసింది. ఆడపడచులంతా కలిసి వదినా మరదళ్లకు దావత్ ఇచ్చారు. వదినలు, మరదళ్లు అంతా కలిసి ఆడిపాడారు. అల్లరి చేశారు. ఇదంతా చూస్తున్న కన్నవారు కళ్లనిండా నీళ్లతో అలా నిలబడి చూస్తుండిపోయారు. ఒకే ఊరిలో పుట్టిపెరిగారు. చిన్నతనంలో కలిసి ఆడుకున్న వాళ్లంతా పెద్ధై అత్తవారి ఇళ్లకు వెళ్లిపోయారు.. పెళ్లి తర్వాత పిల్లలు, సంసారం, బాధ్యతలు అంటూ పీకలదాకా బిజీ, ఒత్తిడితో ఆ ఆడబిడ్డలంతా సంతోషంగా ఒక్కచోట చేరి ఆడిపాడారు. ఎన్నో ఏళ్ల తరువాత ఒకచోట కలిసిన వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంబరపడ్డారు.. ఇన్నాళ్లకు కలిసి ఆనందంలో అందరి కళ్లు ఆనంద బాష్పలతో నిండిపోయాయి.

# ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ విజయవంతం చేయాలి



**అచ్చంపేట,మే 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఆపరేషన్ సిందూర్ తో భారత సైన్యం చూపెట్టిన పరాక్రమాన్ని, ధైర్య సాహసాలను కీర్తిస్తూ.. భారత త్రివిధ దళాల సైనిక చర్య విజయానికి మద్దతుగా అచ్చంపేట పట్టణ పరిధిలో ఈ నెల 23 వ తేదీన సాయంత్రం 4 గంటలకు 'తిరంగా యాత్ర' నిర్వహించడం జరుగుతుందని నాయకులు తెలిపారు ఈ యాత్రలో పార్టీలకతీతంగా నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాల,మత సంస్థల, నాయకులు పెద్దలు పాల్గొనాలని తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్ రెడ్డి,నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, పార్లమెంటు కన్వీనర్ రాగి రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ రావు, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ ముక్తాల రేనయ్య, నాగర్ కర్నూల్ జిల్లా కార్య దర్శి శీను నాయక్, సైదులు యాదవ్, మహిళా మోర్చా నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బల్మూర్ జానకి, మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు,ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిడ్డకు జన్మనిచ్చి తల్లి మృతి



**కల్వకుర్తి, మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో కాన్పుకు వచ్చిన మహిళ ఆడపిల్లకి జన్మనిచ్చి,చికిత్స పొందుతూ హైద్రాబాద్ ఆసుపత్రిలో మృతి చెందింది. వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన వెంకటేష్ తన భార్య రేణుక మొదటి కాన్పు కోసం ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి నార్మల్ చేకప్ కోసం వెళ్లారు%ౌ అక్కడ స్కానింగ్ చేసి వైద్యులు పరీక్షించి కడుపులో బిడ్డ కు రక్త సరఫరా జరగడం లేదని చెప్పి,ఆపరేషన్ చేసుకోవాలని సూచించారు.. అదే రోజు రాత్రి రేణుకకు ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు.అయితే ఆమె బిడ్డకు జన్మనిచ్చిన తరువాత రక్తస్రావం కావడంతో వైద్యులు వివిధ రకాల చికిత్సలు అందించి రక్తం కారకుండా చూసుకున్నారు.ఎక్కువ మొత్తంలో రక్తం పోవడంతో ఆమె కి రక్తం ఎక్కించాలని డాక్టర్లు భావించి ఒక ప్యాకెట్ రక్తం ఎక్కించారు.అంత బాగానే ఉందని అనుకున్న తరుణంలో సోమవారం సాయంత్రం నుంచి రేణుక కు మూత్రం రావడం ఆగిపోయింది.దీంతో ఆసుపత్రి డాక్టర్లు ఆమెను పరీక్షించి చికిత్స అందించినా ప్రయోజనం లేకపోవడంతో చికిత్స నిమిత్తం హైద్రాబాద్ మలక్ పేట యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందింది అని కుటుంబీకులు తెలిపారు. మృతికి గల కారణం ప్రైవేటు ఆసుపత్రి అని భావించి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని కల్వకుర్తి లోని ప్రైవేటు ఆస్పత్రి వద్ద రాత్రి 12 గంటల సమయంలో ఉంచి నిరసన వ్యక్తం చేశారు.కోపంతో బంధువులు హాస్పిటల్ లో అద్దాలను ధ్వంసం చేశారు. హాస్పిటల్ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.కుటుంబ సభ్యులు సరైన న్యాయం చేయాలని కోరడంతో,వైద్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో అనంతరం మృతదేహాన్ని మంగళవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

**కల్వకుర్తి,మే 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, ఇందిరమ్మ శక్తి పథకం ద్వారా, బలరాం నగర్ ముస్లిం మహిళలకు, కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కల్వకుర్తి బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయకుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, , వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నంభూపతిరెడ్డి, వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,. తదితరులు పాల్గొన్నారు.

# వారధి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల అవకతవకలపై విచారణ జరిపించాలి

-ఏఐవైఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ డిమాండ్
- చాన్నాళ్లుగా చక్రం తిప్పుతున్న రిటైర్డ్ ఉద్యోగి
- లక్ష కొట్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం పట్టు
-కంచే చేను మేసింది కావలేవరు
-వారధి మాటున ఉద్యోగాల దందా



**కరీంనగర్, మే 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కరీంనగర్ జిల్లాలో వారధి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల రిక్రూట్మెంట్‌లిలిలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఫ్) ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐవైఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ మాట్లాడుతూ, వారధి పేరుతో ఉద్యోగాల దందా నడుస్తోందని,సంబంధిత జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవటంలో విఫలమైందని విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన వారధి సోసైటీ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆరోపించారు. ప్రభుత్వ మేడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం వచ్చిన 400 దరఖాస్తుల్లో 10 మందిని ఎంపిక చేయగా,ఇద్దరు ఉద్యోగాలు వదులుకోవడంతో తదుపరి మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయాల్సి ఉండగా,సంబంధిత అధికారి తన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపించారు.

**నోటిఫికేషన్ జారీ చేసిన నియామకాల్లో జాప్యం ఎందుకు?**

మెడికల్ కళాశాల నిర్వహణ కోసం గతేడాది అక్టోబర్/నవంబర్‌లో 52 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేసినా,ఆరు నెలలు గడుస్తున్నా నియామక ప్రక్రియ పూర్తి కాలేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ అధికారి జోక్యం చేసుకుని లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయన్న అనుమానం రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. జిల్లా మేజిస్ట్రేట్ వారధి సోసైటీలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి,పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఏఐవైఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చెంచాల మురళి,తదితరులు పాల్గొన్నారు.

# కుట్రపూరితంగా నోటీసులు

## కేసీఆర్‌కు నోటీసులపై కవిత



**హైదరాబాద్ మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నుంచి నోటీసులు జారీ అయిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ఈ నోటీ-సులను ఖండిస్తూ ఆమె తన అధికారిక సోషల్ మీడియా ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె, ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రజానాయకుడు కేసీఆర్ కి రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు... కాంగ్రెస్ కమిషన్ అని మరోసారి తేటతెల్లమైందని అన్నారు. కాళేశ్వరం ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన బృహత్ ప్రాజెక్టు. తెలంగాణ ప్రజల తరతరాల దాహార్తిని తీర్చడానికి, తెలంగాణ పొలాల్లోకి గోదావరి నీళ్లను గళగళా తరలించడానికి కట్టిన ప్రాజెక్టు. తాను కలలు గన్న తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ గారు కట్టిన ప్రాజెక్టే కాళేశ్వరం అంటూ తెలిపారు. ఇది రాజకీయ కక్షతో, కుట్రతో ఇచ్చిన ఈ నోటీ-సులు, వేసిన కమిషన్లు కాలక్రమంలో తప్పకుండా న్యాయాన్ని గెలిపిస్తాయి. నిజాలన్నీ బయటకు వస్తాయని, రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు-నాట్లు- ఆమె రాసుకొచ్చారు. చూడాలి మరి నేడు జారీ అయినా నోటీ-సులకు ఎలాంటి సమాధానాలు ఇవ్వబోతున్నారో నాయకులు. ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రజానాయకుడు కేసీఆర్ గారికి రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు- చేసిన కాళేశ్వరం కమిషన్ నోటీ-సులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను.

# భారత మామిడి ఎగుమతులపై ఆంక్షలు

డాక్యుమెంటేషన్ లోపాలతో తిరస్కరణ
భారీగా నష్టపోనున్న ఎగుమతిదారులు



**న్యూఢిల్లీ, మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత మామిడి ఎగుమతులపై అమెరికా వ్యవహరిస్తున్న తీరు కారణంగా భారీగా నష్టాలు కలుగబోతున్నాయి. అమెరికాలోని లాస్ ఏంజిల్స్, శాన్ ఫ్రాన్సిస్కో, అట్లాంటాతో సహా వివిధ విమానాశ్రయాలకు భారత్ నుంచి 15 కంటైనర్లలో మామిడి షిప్‌మెంట్లు వెళ్లాయి. డాక్యుమెంటేషన్ లోపాల పేరుతో అమెరికా అధికారులు ఎగుమతైన ఆ మామిడి పండ్లను తిరస్కరించారు. అమెరికా నిర్ణయం మామిడిపండ్ల ఎగుమతిదారులను తీవ్ర షాక్‌కు గురి చేసింది. ఆ మామిడిపండ్లను తిరిగి భారత్‌కు తీసుకొచ్చినా అది తీవ్ర ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పాడైపోయే అవకాశం ఎక్కువే. దీంతో ఎటూ పాలుపోని పరిస్థితిలో ఉన్న చాలా మంది ఎగుమతిదారులు మామిడి సరకును అమెరికాలోనే పడేయ్యాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచంలోనే మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉన్నది. అమెరికా.. భారత్‌కు ప్రధాన దిగుమతిదారుగా ఉన్నది. ఇంత పెద్ద మొత్తంలో భారత్ నుంచి ఎగుమతి అయిన మామిడిపండ్లను సరైన డాక్యుమెంటేషన్ లేదనే కారణంతో అమెరికా తిరస్కరించటం చర్చనీయాంశంగా మారింది. అమెరికా చర్యతో ఐదు లక్షల డాలర్ల అంటే రూ.4.27 కోట్ల నష్టాన్ని ఎగుమతి దారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఈనెల 8, 9 తేదీలలో.. అమెరికాకు ఎగుమతి అయ్యే ఈ మామిడి పండ్లు ముంబయిలో ఇర్రేడియేషన్ ప్రక్రియకు వెళ్లాయి. అమెరికాకు ఎగుమతి కావాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరి. మామిడిలో తెగుళ్లు తొలగించటానికి, అవి ఎక్కువ కాలం ఉండటానికి పండ్లను నియంత్రిత ఇర్రేడియేషన్‌కు పంపుతారు. ఈ ప్రక్రియ జరిగినప్పటికీ.. అక్కడి అమెరికా అధికారులు మాత్రం డాక్యుమెంటేషన్‌లో పొరపాట్లను కారణంగా చూపెడుతూ ఎగుమతిని తిరస్కరించారు. ముఖ్యంగా, పీపీక్యూ 203 ఫారంలో తప్పులు దొర్లాయని చెప్పారు. పీపీక్యూ 203 ఫారం సరిగ్గా జారీ చేయని కారణంగా సరకును తిరస్కరించినట్లు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తెలిపింది. సరకును వెనక్కి పంపటమో, ధ్వంసం చేయటమో చేయాలని చెప్పింది. వెనక్కి పంపేందుకు అయ్యే ఖర్చును అమెరికా ప్రభుత్వం భరించదని అమెరికా వ్యవసాయ విభాగం స్పష్టం చేసినట్టు వ్యాపారులు తెలిపారు. ముంబయిలోని ఇర్రేడియేషన్ కేంద్రంలో యుఎస్‌డిఎ ప్రతినిధి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుందని వారు అన్నారు. అమెరికాకు మామిడి పండ్ల ఎగుమతికి అవసరమైన పిపిక్యూ203 ఫారమ్‌ను ఆ ప్రతినిధే ధ్రువీకరించాలి. ఇర్రేడియేషన్ కేంద్రంలో జరిగిన పొరపాట్లకు మేము నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఎగుమతిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇర్రేడియేషన్‌కు సంబంధించిన నిబంధనలు పాటించలేదని అమెరికా అధికారులు చెప్పున్నదానిలో వాస్తవం లేదని ఒక వ్యాపారి తెలిపాడు. ప్రక్రియ పూర్తయ్యాకే పిపిక్యూ203 ఫారమ్ ఇచ్చారనీ, యూఎస్‌డీఏ అధికారి జారీ చేసిన ఆ ఫారమ్ లేకుండా ముంబయి ఎయిర్‌పోర్టులో మామిడి పండ్లను విమానంలోకి ఎక్కించటానికి కూడా అనుమతించరని వివరించాడు.

## ఐబీ చీఫ్ తపన్ డేకా పదవీకాలం మరో ఏడాది పొడిగింపు



**న్యూఢిల్లీ, మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిఘా విభాగాధిపతి (ఐబీ చీఫ్) తపన్ కుమార్ డేకా పదవీకాలాన్ని కేంద్రం మరోసారి పొడిగించింది. కేబినెట్ నియామకాల కమిటీ మరో ఏడాది పాటూ ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం నిర్ణయంతో 2026 జూన్ వరకు ఆయన ఐబీ చీఫ్‌గా కొనసాగనున్నారు.హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు చెందిన డేకా 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 1998లో ఐబీలో చేరారు. 2022 జూలై ఒకటో తేదీన ఆయన ఐబీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 2024లో ఆయన పదవీకాలాన్ని కేంద్రం ఏడాది పాటూ పొడిగించింది. ఈ ఏడాది జూన్ వరకూ ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ గతేడాది ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన పదవీకాలం ముగియనుండటంతో మరోసారి పొడిగించింది.

# పూంచ్‌లో పాక్ లైవ్ షెల్.. ధ్వంసం చేసిన భారత ఆర్మీ



**న్యూఢిల్లీ, మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ జమ్ము కశ్మీర్‌లో పాక్ ప్రయోగించిన ఓ లైవ్ షెల్ బయటపడింది. రోడ్డు పక్కన ఈ షెల్‌ను గుర్తించిన స్థానికులు.. అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న భారత ఆర్మీ పాక్ షెల్‌ను విజయవంతంగా ధ్వంసం చేసింది.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ దాడులను జీర్ణించుకోలేని పాక్ తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. భారత సరిహద్దు గ్రామాలపై దాడులకు పాల్పడింది. ముఖ్యంగా జమ్ము కశ్మీర్ సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్లు, బాంబ్ షెల్స్‌ను ప్రయోగించింది. అప్రమత్తమైన సైన్యం సరిహద్దు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. అయితే, ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో ప్రజలు తమ గ్రామాలకు చేరుకున్నారు. ఈ క్రమంలో పూంచ్ వద్ద రోడ్డు పక్కన పాక్ ప్రయోగించిన లైవ్ షెల్‌ను గుర్తించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన భద్రతా దళాలు దాన్ని పేల్చేశాయి. పాక్ చర్యలకు పూంచ్ ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రభావితమయ్యారు. అక్కడ 25 మంది ప్రాణాలు కోల్పోయారు.

# సిఎం రేవంత్‌తో నష్యా కాన్సుల్ జనరల్ భేటీ



**హైదరాబాద్, మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెన్నైలోని రష్యా కాన్సుల్ జనరల్ శ్రీ వాలెరీ ఖోడ్జాయేవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తెలంగానలో చేపట్టిన అభివృద్ధి పనులను, పెట్టుబలుకు సంబంధించిన అంశాలను చర్చించారు. ఫ్యూచటర్ సిటీతో పాటు పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.

# పాక్ ఆర్మీ చీఫ్‌కు ప్రమోషన్

## ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి



**ఇస్లామాబాద్ మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ దాయాది దేశం పాకకలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అక్కడి సైన్యాధ్యక్షుడు జనరల్ ఆసిం మునీర్‌కు ప్రభుత్వం ప్రమోషన్ ఇచ్చింది. దేశంలో అత్యున్నత సైనిక హోదా కలిగిన 'ఫీల్డ్ మార్షల్'గా నియమించేందుకు అక్కడి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిసింది. ఇటీ-వల భారత్-పాకిస్థాన్‌ల మధ్య చోటు-చేసుకున్న ఘర్షణలో ఆసిం మునీర్ కీలక పాత్ర వహించినట్లు- దాయాది దేశం భావిస్తోందట. ఇందులో తామే పైచేయి సాధించినట్లు- చెబుతున్నట్లు- సమాచారం. ఇలా వారి సాయుధ బలగాలను ముందుండి నడిపించినందుకే ఆర్మీ చీఫ్‌కు తాజా ప్రమోషన్ కట్టబెట్టినట్లు- స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాక్‌లోని ఉగ్ర, సైనిక స్థావరాలను తీవ్రంగా ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి అనేక ఆధారాలను కూడా భారత సైన్యం విడుదల చేసింది. ఈ క్రమంలో పదుల సంఖ్యలో పాకిస్థాన్ సైనికులు, అధికారులు మృతి చెందారని, అనేకమంది పాక్ సైనికులు గాయపడినట్లు- భారత సైనిక వర్గాలు వెల్లడించాయి. అయినప్పటికీ తమదే పైచేయి అని భ్రమలో ఉన్న పాకిస్థాన్.. తమ సైన్యాధ్యక్షుడికి పదోన్నతి కల్పించడం గమనార్హం.

# హైదరాబాద్‌లో మరో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,మే 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలో మరో అగ్నిప్రమాదం జరిగింది. నగరంలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనం రెండో అంతస్తులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో దట్టంగా పొగ కమ్ముకుంది. మంటలు చెలరేగడంతో భవనంలోని నివాసితులు వెంటనే కిందకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా, రెండు రోజుల క్రితం పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఒకే కుటు-ంబంలోని 17మంది ప్రాణాలు కోల్పోయారు.